క్లుప్తంగా

ట్యాంక్ నిర్మాణం సకాలంలో పూర్తిచేయాలి



ట్యాంక్ పనులను పరిశీలిస్తున్న కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ రమణారెడ్డి

కల్లూరు: ఓహెచ్‌ఆర్‌ఎస్ ట్యాంక్ నిర్మాణాన్ని సకాలంలో పూర్తి చేయాలని కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కేవీ రమణారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనాథ్‌రెడ్డి కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. సోమవారం బస్తిపాడు గ్రామం చింతవనంలో నిర్మిస్తున్న ఓహెచ్‌ఆర్‌ఎస్ ఫౌండేషన్ స్టీల్ పనులను వారు పరిశీలించారు. కేవీ రమణారెడ్డి మాట్లాడుతూ గ్రామంలో ఇంటింటికీ తాగునీరు అందించడం కోసమే ట్యాంక్‌ను నిర్మిస్తున్నామన్నారు. గ్రామంలో ఇప్పటికే ఇంటింటికీ కుళ్లాయి కనెక్షన్ ఇచ్చామన్నారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు పాల్గొన్నారు.

నేడు గోరుకల్లులో 'గడప గడపకు-మన ప్రభుత్వం'

పాణ్యం: మండల పరిధిలోని గోరుకల్లు గ్రామంలో మంగళవారం గడప గడపకు–మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ దస్తగిరి సోమవారం తెలిపారు. ఉదయం 8 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తప్పక హాజరు కావాలన్నారు. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పాల్గొని ఆయా కుటుంబాలకు అందిన సంక్షేమ పథకాలపై ఆరా తీస్తారన్నారు.

భూ రీ సర్వేను సక్రమంగా నిర్వహించాలి

గూడూరు రూరల్ : మండల వ్యాప్తంగా చేపట్టిన భూముల రీ సర్వేను సక్రమంగా నిర్వహించాలని సిబ్బందికి తహసీల్దార్ వెంకటరమణ ఆదేశించారు. కె.నాగాపురంలో జరుగుతున్న సర్వేను సోమవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల జిల్లా కలెక్టర్ నిర్వహించిన స్పందనలో ఎక్కువ శాతం రైతులు భూ సమస్యలపై ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. భూ రీ సర్వేలో పొరపాట్లకు అవకాశం లేకుండా సక్రమంగా నిర్వహించాలని సూచించారు.

పంటల వివరాలను సేకరించండి

సి.బెళగల్: మండలంలో 2023 ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసిన పంటల వివరాలను సేకరించాలని ఏఓ మల్లేష్‌కుమార్ వ్యవసాయ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం వ్యవసాయ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు.ఆయన మాట్లాడుతూ.. గ్రామాలలో వ్యవసాయ, ఉద్యానవన పంటలు, రైతుల వివరాలను సేకరించాలన్నారు. రైతుల నుంచి పంట పొలం పాసుబుక్కు, ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతాల వివరాలు తీసుకోవాలని చెప్పారు. సమావేశంలో ఏఈఓ సిద్దు, ఎంపీఈఓలు, వీఏఏలు తదితరులు ఉన్నారు.

టీబీ పేషంట్లకు పౌష్టికాహార కిట్ల పంపిణీ



కిట్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

గూడూరు: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రధాన మంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ పవర్ గ్రిడ్ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం టీబీ పేషంట్లకు న్యూట్రిషన్ కిట్లను అందించారు. మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ గౌడ్, వైద్యాధికార్లు డాక్టర్ ప్రత్యూష, డాక్టర్ రేష్మ పాల్గొన్నారు. వైద్యాధికారులు మాట్లాడుతూ టీబీ పేషంట్లు ప్రతి రోజు పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. వారికి ఆరోగ్య భద్రత, ఆహార నియమాలను తెలిపారు. టీబీ సూపర్‌వైజర్లు నాగ మహేంద్ర, ఎస్ రామకృష్ణ, రాఘవయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కర్నూలు సిటీ: కర్నూలు రూరల్ మండల పరిధిలోని గొందిపర్ల వద్ద నిర్మిస్తున్న 132 కేవీ స్విచ్చింగ్ స్టేషన్‌లో కండక్టర్ మార్పిడి నిమిత్తం మంగళవారం ఎన్‌హెచ్–7 సబ్‌స్టేషన్, పంచలింగాల సబ్ స్టేషన్ల పరిధిలోని విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లుఏఈ ఆంజనేయ శాస్త్రి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సబ్ స్టేషన్ల పరిధిలోని పంచలింగాల గ్రామంతో పాటు సబ్‌జైలు , కొత్త, పాత స్కంద వెంచర్లు, ఈ.తాండ్రపాడు, గొందిపర్ల, పూలతోట, దేవమాడ, దొడ్డిపాడు గ్రామాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అలాగే వ్యవసాయానికి మంగళవారం తెల్లవారుజామున 2 నుంచి ఉదయం 9 గంటల వరకు మాత్రమే విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన

కర్నూలు సిటీ: కేవీఆర్ మహిళా డిగ్రీ కాలేజీలో ఎన్ఎస్ఎస్ విభాగం, రెడ్‌రిబ్బన్ క్లబ్ విభాగాల ఆధ్వర్యంలో సోమవారం హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆ కాలేజీ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డా.వి.వి.ఎస్ కుమార్ పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో రెడ్ రిబ్బన్ క్లబ్ కో–ఆర్డినేటర్ డా.జి. సీతమ్మ, ఎన్.ఎస్.ఎస్ కో–ఆర్డినేటర్ జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఈర్లదిన్నెలో సంక్షేమ బోర్డును ఆవిష్కరిస్తున్న జేసీఎస్ మండల కన్వీనర్ సీబీ తులసిరెడ్డి



ఎ.గోకులపాడులో మాట్లాడుతున్న డీఎల్‌డీఓ బాలకృష్ణరెడ్డి



గడిగరేవుల గ్రామంలో బుక్‌లెట్లను పంపిణీ చేస్తున్న దృశ్యం



కొమరోలులో సంక్షేమం గురించి అవగాహన కల్పిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

జగనన్నతోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి

- ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్
- నందనపల్లెలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం



పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్, ఎంపీపీ వెంకటేశ్వరమ్మ, జెడ్పీటీసీ ప్రసన్నకుమార్

కర్నూలు సిటీ: రాష్ట్ర సమగ్రాభివృద్ధి సీఎం జగనన్నతోనే సాధ్యమని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. సోమవారం నందనపల్లెలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే అనే కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు, ఎంపీపీ డి.వెంకటేశ్వరమ్మ, జెడ్పీటీసీ ప్రసన్నకుమార్ పాల్గొన్నారు. ముందుగా గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండాను, ఆ తరువాత సచివాలయంలో ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లోని మ్యానిఫెస్టోలో పేర్కొన్న హామీలన్నింటినీ అవినీతికి తావు లేకుండా పథకాలను అమలు చేశామన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా నేరుగా ఇంటికే ఫించన్, సంక్షేమ పథకాలు అందజేస్తున్నారన్నారు.

కులమతాలకు అతీతంగా పథకాలు

రాష్ట్రంలో అమలు అవుతున్న సంక్షేమ పథకాలను పార్టీలకు, కులాలకు, మతాలకు, ప్రాంతాలకు అతీతంగా అర్హతే ప్రమాణికంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే అన్నారు. నాలుగున్నరేళ్ళుగా నందన పల్లె సచివాలయం పరిధిలో నవరత్నాల పథకాల ద్వారా రూ.24,96,26,293 రూపాయలు ప్రత్యక్ష నగదు బదిలీ ద్వారా లబ్ధి చూకూరిందన్నారు. టీడీపీ నేతలలాగా మాయ మాటలు చెప్పే అలవాటు తమకు లేదని, మాట ఇచ్చామంటే ఖచ్చితంగా ఎంత కష్టమైన అమలు చేస్తామని చెప్పారు. మరోసారి జగనన్నను సీఎంగా చేసుకోవాలని, తనను రెండోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మహబూబ్ బాషా, వైస్ ఎంపీపీ నెహిమియా, గ్రామ సర్పంచ్ మాధురి, ఉల్చాల సర్పంచ్ సాగర్, స్థానిక నాయకులు మజీద్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల వద్దకే సంక్షేమ పథకాలు

సి.బెళగల్: ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులైన వారి ఇళ్లకే నేరుగా చేర్చుతున్నాయని జేసీఎస్ మండల కన్వీనర్ సీబీ తులసిరెడ్డి అన్నారు. సోమవారం సి.బెళగల్ మండలంలోని ఈర్లదిన్నె గ్రామ సచివాలయంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు.నాలుగున్నరేళ్లలో గ్రామానికి రూ.23,52,79,693 లను ప్రభుత్వం సంక్షేమ పథకాల ద్వారా అందజేసిందన్నారు. ఈఓఆర్డీ సందీప్, గృహ సారథులు వెంకటేశ్వరరెడ్డి, రామచంద్రరెడ్డి, చిన్న సోమన్న, నాయకులు క్రిష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన వారందరికీ పథకాలు

కల్లూరు: అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తున్నామని కర్నూలు డివిజనల్ అభివృద్ధి అధికారి(డీఎల్‌డీఓ) బాలకృష్ణరెడ్డి అన్నారు. సోమవారం ఎ.గోకులపాడు గ్రామంలో ''ఆంధ్రప్రదేశ్‌కు సీఎం జగనన్నే మళ్లీ ఎందుకు కావాలి'' కార్యక్రమాన్ని ఈఓఆర్డీ రవికిషోర్ అధ్యక్షతన నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు ఈశ్వరయ్య, జేసీఎస్ ఇన్‌చార్జ్ కేశవరెడ్డి, సర్పంచ్ గిడ్డమ్మ, నాయకులు మధుసూదన్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, కార్పొరేటర్ లక్ష్మీకాంతరెడ్డి పాల్గొన్నారు. అలాగే కల్లూరు అర్బన్ 29వ వార్డు శారద నగర్‌లో అర్బన్ జేసీఎస్ ఇన్‌చార్జ్ గోవర్ధన్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ సుదర్శన్‌రెడ్డి, కల్లూరు అర్బన్ క్లస్టర్–1 అధ్యక్షులు భీమ శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు.

జగనన్నతోనే అభివృద్ధి

గడివేముల: జగనన్న పాలన స్వర్ణయుగమని, రాష్ట్రంలో పేదల జీవన ప్రమాణాలను మెరుగు పరిచిన ఘనత ఆయనకే దక్కిందని సర్పంచ్ రామ్మోహన్‌రెడ్డి,ఎంపీటీసీ జక్కుల సావిత్రి అన్నారు. మండల పరిధిలోని గడిగరేవుల గ్రామ సచివాలయంలో సోమవారం ఆంధ్ర ప్రదేశ్ కు జగనన్నే ఎందుకు కావాలంటే (వై ఏపీ నీడ్స్ జగన), పల్లెకు పోదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో రూ.16,19,59,740 ప్రభుత్వ నుంచి లబ్ధి పొందారన్నారు. కార్యక్రమంలో తిరుపాడు సర్పంచ్ బాలలింగమ్మ, ఉప సర్పంచ్ గోదా ప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు హరినాథరెడ్డి, నగరి శివుడు తదితరులు పాల్గొన్నారు.

జగన్ హయాంలోనే సంక్షేమ బావుట

ఓర్వకల్లు : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హయాంలోనే అర్హతగల ప్రతి కుటంబానికి సంక్షేమ పథకాలు అందజేసి సంక్షేమ బావుట ఎగురవేశారని కర్నూలు మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కొమరోలు గ్రామంలో గ్రామ సర్పంచు రామచంద్రుడు ఆధ్వర్యంలో 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి'(వై ఏపీ నీడ్ జగన్) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీపీ తిప్పన్న, జెడ్పీటీసీ సభ్యుడు రంగనాథ్‌గౌడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు శ్రీరెడ్డి చెన్నారెడ్డి, సచివాలయ మండల జేసీఎస్ కన్వీనర్ లోటర్‌బాషా ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు.

సిద్ధరామలింగేశ్వరాలయంలో ధార్మిక సప్తాహం



ధార్మిక సప్తాహం కార్యక్రమంలో పాల్గొన్న పీఠాధిపతులు

కల్లూరు: కల్లూరు మండలం పెద్దటేకూరు గ్రామంలో వెలసిన శ్రీ సిద్ధ రామలింగేశ్వరాలయంలో సోమవారం ధార్మిక సప్తాహం ప్రారంభమయ్యింది. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని టీడీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి, సద్గురు శ్రీ నాగలింగ శివాచార్య స్వాముల మఠాధిపతి ఎల్లప్ప స్వామి తెలిపారు. వారు మాట్లాడుతూ వారం రోజుల పాటు కార్తీక మాస విశిష్టత గురించి ప్రవచనాలు, భజనలు ఉంటాయన్నారు. 26న సహస్ర కార్తిక దీపోత్సవం తదితర కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మంగళవారం కాశీ జగద్గురు శ్రీ శ్రీ శ్రీ మల్లికార్జున విశ్వారాధ్య శివాచార్య మహాస్వాములతో పాటు వివిధ పీఠాలకు చెందిన పీఠాధిపతులు, మఠాధిపతులు, ధార్మిక సంస్థల ప్రతినిధులు హాజరకానున్నట్లు ఎల్లప్ప స్వామి తెలిపారు. కార్యక్రమంలో తితిదే హిందూ ధర్మ ప్రచార మండలి సభ్యులు మేడా సుబ్రహ్మణ్యం స్వామి, శ్రీరాములు, మోక్షేశ్వరుడు, గిడ్డయ్య, రామానాయుడు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో లక్ష బిల్వార్చన

కర్నూలు కల్చరల్: భగవాన్ పుట్టపర్తి సత్యసాయి బాబా జయంతి వేడుకలను పురస్కరించుకొని సోమవారం స్థానిక నెహ్రూనగర్‌లోని సత్యసాయి మందిరంలో ప్రత్యేక పూజలు, ప్రార్థనలు నిర్వహించారు. సాయీశ్వరాలయంలో స్వామి వారికి అభిషేకం, లక్ష బిల్వార్చన, సప్త హారతులు కార్యక్రమాలు చేశారు. చిన్మయ మిషన్ జిల్లా బాధ్యులు స్వామిని సుప్రేమానంద, డాక్టర్ వసుంధరా సంజీవ్‌కుమార్ పూజల్లో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సాయి సేవా ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు మాకా అశోక్‌కుమార్, సభ్యులు, సాయి భక్తులు పాల్గొన్నారు.

ప్రజల కోసం పని చేసే నాయకులను గుర్తించండి



మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే డా.జరదొడ్డి సుధాకర్

కర్నూలు సిటీ: ప్రజల కోసం పని చేసే నాయకులను గుర్తించాలని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. కర్నూలు రూరల్ మండల పరిధిలోని గార్గేయపురంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు.ప్రజాప్రతినిధులకు మహిళలు హారతులు ఇస్తూ స్వాగతం పలికారు. జెడ్పీటీసీ ప్రసన్నకుమార్, ఎంపీపీ డి.వెంకటేశ్వరమ్మ, పార్టీ నాయకులతో కలిసి ప్రతి ఇంటికి వెళ్లి ఆప్యాయంగా పలకరిస్తూ.. సంక్షేమ పథకాల ద్వారా అందిన లబ్ధిని వివరించారు. అలాగే ప్రజల బాగోగులు అడిగి తెలుసుకున్నారు.ఆయన మాట్లాడుతూ.. సీఎం జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలంతా సంతోషంగా ఉన్నారని, ప్రజలంతా నిండు మనసుతో మరోసారి జగనన్నను ఆశీర్వదించి రెండోసారి సీఎంగాను, తనను ఎమ్మెల్యేగా ఎన్నుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నెహిమియా, మండల కన్వీనర్ మహబూబ్ బాషా, సర్పంచ్ సోమేశ్వరమ్మ, సింగిల్ విండో చైర్మన్ శేషిరెడ్డి, విజిలెన్స్ మానిటరింగ్ సభ్యులు రవిశాస్త్రి, నాయకులు ప్రకాశం, మోజెస్, యేసురత్నం, లావన్న, మాజీ సర్పంచ్ యేసేపు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలు



సి.బెళగల్‌లో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అధికారులు

సి.బెళగల్:గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలని ఈఓఆర్డీ సందీప్ అన్నారు. సోమవారం 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని స్థానిక గ్రంథాలయంలో గ్రామ సర్పంచ్ పాండురంగన్న అధ్యక్షతన లైబ్రేరియన్ వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆటపోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోనేనాయక్, ఎంఈఓ – 2 ఆదామ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.



భోగేశ్వరంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు



కాల్వబుగ్గలో స్వామివారికి పూజలు చేస్తున్న దృశ్యం

కార్తీక శోభితం

- భక్తుల శివనామస్మరణతో హోరెత్తిన శైవక్షేత్రాలు

ఓర్వకల్లు: మండలంలోని కాల్వబుగ్గ దేవస్థానం కార్తీక శోభతో కళకళలాడింది. పరమ శివునికి అత్యంత ప్రీతిదాయకమైన కార్తీక మాసంలో శివపార్వతులను దర్శించుకోవడం పుణ్యప్రదం కావడంతో తొలి సోమవారం భక్తులతో శివాలయాలు కిటకిటలాడాయి. ఇందులో భాగంగా మండలంలోని కాల్వబుగ్గలో బుగ్గరామేశ్వరస్వామి, గుమ్మితం మల్లికార్జునస్వామి, కన్నమడకల కాశీబుగ్గరామేశ్వరస్వామి, నన్నూరులో నాగలింగేశ్వరస్వామి ఆలయాలు భక్తుల హరినామస్మరణతో మార్మోగాయి. బుగ్గరామేశ్వరస్వామి దేవస్థానంలో ప్రధాన అర్చకులు కల్లె లక్ష్మీనారాయణశర్మ, నరసింహశర్మ ఆధ్వర్యంలో స్వామి అమ్మవార్లకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు పుష్కరణిలో స్నానాలు ఆచరించి ధ్వజస్తంభం వద్ద జ్యోతులు వెలిగించారు.

భోగేశ్వరంలో ..

గడివేముల: మండల పరిధిలోని గడిగరేవుల గ్రామ సమీపంలో వెలసిన దుర్గాభోగేశ్వరాలయం కార్తీకమాసం మొదటి సోమవారం కావడంతో వందలాది మందితో కిక్కిరిసింది. భక్తులు భోగేశ్వరానికి తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. గడిగరేవుల గ్రామంలో స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు.

ఘనంగా ఫార్మసీ వారోత్సవాలు



మైక్రో బయాలజీ విభాగ అధిపతి శ్రీనివాసరావును సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ మధుసుదన్‌శెట్టి

పాణ్యం : మండల పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న శాంతిరాం ఫార్మసీ కళాశాలలో జాతీయ ఫార్మసీ వారోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సోమవారం ప్రిన్సిపాల్ మధుసూదన్‌శెట్టి ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రి బయాలజీ విభాగ అధిపతి శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ అవసరం ఉన్నా లేకున్నా పదేపదే మందులు వాడడం వలన రోగ నిరోధశక్తి తగ్గిపోతుందనే విషయాన్ని తెలుసుకోవాలన్నారు. యాంటిబయాటిక్ మందులు విచ్చలవిడిగా వాడితే ప్రాణాలకే ముప్పని హెచ్చరించారు. కార్యక్రమంలో డాక్టర్ నిస్సి ప్రి యా, ప్రొఫెసర్ జయశ్రీ పాల్గొన్నారు.

కల్లూరు: చిన్నటేకూరు సమీపంలోని సీఈఎస్ ఫార్మసీ కళాశాలలో కర్నూలు ఇండియన్ ఫార్మసూటికల్స్ అసోసియేషన్, కర్నూలు లోకల్ బ్రాంచి వారి ఆధ్వర్యంలో సోమవారం జాతీయ ఫార్మసీ వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కర్నూలులో కలెక్టర్ నుంచి జిల్లా పరిషత్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఔషధం లేనిదే చికిత్స లేదని, ఫార్మసిస్టులు నిత్యం ప్రజలకు సేవ చేస్తున్నారని కళాశాల ప్రిన్సిపల్ రవి ప్రకాష్ అన్నారు.

స్పందన సమస్యలను త్వరగా పరిష్కరించాలి

కోడుమూరు రూరల్ : స్పందన కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల రైతుల నుంచి వచ్చే అర్జీల పరిష్కారానికి త్వరగా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ జయన్న వీఆర్వోలను ఆదేశించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల అధికారులు స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. తహసీల్దార్ మాట్లాడుతూ భూ సమస్యలపై రైతుల నుంచి వచ్చే అర్జీలను పరిశీలించి, వాటికి సంబంధించిన పత్రాలను తెప్పించుకుని పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ మంజుల, సూపరింటెండెంట్ కృష్ణారెడ్డి, ఏపీఎం పుష్పావతి తదితరులున్నారు.

సి.బెళగల్: ప్రజల అర్జీల రూపంలో ఇచ్చిన సమస్యలను మండల, గ్రామ స్థాయి అధికారులు వెంటనే పరిష్కారం అయ్యేలా చూడాలని తహసీల్దార్ శేషఫణి అన్నారు. సోమవారం వారు తన కార్యాలయంలో మండల అధికారులతో కలిసి స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు



పాణ్యం: విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంపీపీ ఉసేన్‌బీ



కల్లూరులో విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న దృశ్యం



ఓర్వకల్లు: విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేస్తున్న హనుమేనాయక్

కల్లూరు: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్ ప్రిన్సిపాల్ గురప్ప అన్నారు. సోమవారం పాఠశాలలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం సందర్భంగా వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పుస్తకాలు స్నేహితులతో సమానమని, పుస్తక పఠనం అలవరుచుకోవానలి ఆయన విద్యార్థులకు సూచించారు.

ఓర్వకల్లు: మండలంలోని నన్నూరు, ఓర్వకల్లు శాఖా గ్రంథాలయాల్లో వారం రోజుల పాటు నిర్వహించిన జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సోమవారం ముగిశాయి. ఆయా శాఖల గ్రంథాలయాధికారులు కౌసల్య, హనుమేనాయక్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు పలు విజ్ఞాన, వినోద కార్యక్రమాలు నిర్వహించారు. ముగింపు సందర్భంగా వ్యాసరచన, వక్తృత్వ, ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు.

గూడూరు: పట్టణంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సోమవారంతో ముగిశాయి. గ్రంథాలయ అధికారి మధునాయుడు ఆధ్వర్యంలో విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన బహుమతుల పంపిణీ కార్యక్రమానికి ఎంఈఓ–2 నాగరాజు, హెచ్‌ఎం డి.సురేష్‌బాబు, ఎస్ఐ పీరయ్య హాజరయ్యారు.

పాణ్యం: గ్రంథాలయ వారోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ముగింపు సందర్భంగా వీరనారాయణస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివిధ రంగాల్లో గెలుపొందిన విద్యార్థులకు ఎంపీపీ ఉసేన్‌బీ బహుమతులు అందించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గడివేముల: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా రాజరాజేశ్వరి ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ హై స్కూల్, మోడల్‌స్కూల్, కేజీబీవీ విద్యార్థులు పోటీల్లో పాల్గొని పలువురు విజేతలుగా నిలిచారు. వారికి తహసీల్దార్ శ్రీనివాసులు సోమవారం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

షూటింగ్ బాల్ పోటీలకు ఎంపిక



పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ఓర్వకల్లు : మండలంలోని కాల్వబుగ్గ వద్ద గల కాకతీయ పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం మనోహర్ నాయుడు సోమవారం తెలిపారు. పలుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన ఎంపిక పోటీల్లో వీరు ప్రతిభ కనబరిచి జిల్లా జట్టుకు ఎంపికయ్యారన్నారు. వీరు డిసెంబర్ 9–11వ తేదీ వరకు గుంటూరు జిల్లా, బాపట్లలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో కాకతీయ స్కూల్ కరస్పాండెంట్ దేవికాశ్రీ, పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం పరమేశ్వరుడు, శ్రీనివాసులు, పీఈటీలు సూర్యతేజ తదితరులు పాల్గొన్నారు.

గొందిపర్లలో వార్డు మెంబర్ ఆత్మహత్య



తిమ్మప్ప (ఫైల్)

కర్నూలు సిటీ: కర్నూలు రూరల్ మండల పరిధిలోని గొందిపర్ల గ్రామంలోని వార్డు మెంబర్ తిమ్మప్ప నాలుగు రోజుల క్రితం పురుగు మందు తాగాడు. ప్రభుత్వ జనరల్ హాస్పటల్‌లో చికిత్స పొందుతూ కోలుకోలేక సోమవారం రాత్రి మృతి చెందాడు. వెంకటేశ్వర్లు కుమారుడు తిమ్మప్ప గ్రామానికి సమీపంలోని ఓ కంపెనీలో కాంట్రాక్ట్ పనులు చేయిస్తూ ఆదే గ్రామ పంచాయతీలో 12 వార్డుకు సభ్యుడి ఎన్నికైయ్యాడు. కాగా కుటుంబ కలహాలతో గ్రామానికి సమీపంలోని ఓ దర్గా వద్ద పురుగుల మందు తాగి తనకు కావాల్సిన వారికి ఫోన్ చేసి ఇక నేను ఉండను నా కొడుకులను, భార్యను బాగా చూసుకోండని చెప్పాడు. దీంతో అనుమానం వచ్చిన వారు వెతకగా, దర్గా దగ్గర పురుగుల మందు డబ్బాతో కనిపించాడు. వెంటనే చికిత్స కోసం ప్రభుత్వ జనరల్ హాస్పటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందాడు. తిమ్మప్పకు ఇద్దరు కుమారులు, భార్య సువర్ణ ఉన్నారు.

అయోడిన్ లోపంతో ఆరోగ్య సమస్యలు



అయోడిన్ ఉప్పుపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కల్లూరు : అయోడిన్ లోపంతో చిన్న పిల్లలలో ఏదుగుదల లోపం, బుద్ధిమాంద్యం, పెద్ద వయస్సు వారిలో థైరాయిడ్ సమస్యలు వస్తాయని రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమ అధికారిణి హేమలత అన్నారు. సోమవారం ఉలిందకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధి తడకనపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అయోడిన్ ఉప్పు వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అయోడిన్ ఉప్పు వినియోగించడం వల్ల గర్భంలోని శిశువు ఆరోగ్యంగా ఎదుగుతాడన్నారు. ప్రజలు దినసరి ఆహార పదార్థలలో అయోడిన్ సరైనా శాతంలో తీసుకోవాలన్నారు. అనంతరం అయోడిన్ కిట్‌ల ద్వారా ఉప్పులో అయోడిన్ శాతాన్ని పరీక్షించే విధానాన్ని విద్యార్థులకు చూపించారు. అయోడిన్ ఉప్పుకు త్వరగా ఆవిరి అయ్యే లక్షణం ఉంటుందని, ఎండ వేడిమి లేదా గాలి తగలకుండా జాగ్రత్త తీసుకోవాలన్నారు. గాలి చొరబడని మూత ఉన్న డబ్బాలలో నిలువ చేయాలని తెలిపారు.

ఐక్యపోరాటాలతోనే డిమాండ్ల సాధన

కర్నూలు(న్యూటౌన్): ఐక్యపోరాటాలతో న్యాయమైన డిమాండ్లను సాధించుకుందామని ఆలిండియా బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ వి. వరప్రసాద్ పిలుపునిచ్చారు. సోమవారం భూపాల్ రెసిడెన్సిలో ఆ అసోసియేషన్ సర్కిల్ ఎగ్జిక్యూటీవ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. సర్కిల్ కార్యదర్శి వెంకటేశ్వరరావు, సెక్రటరీ కేఎస్ కోటేశ్వర్‌రావు, ఏసీఎస్ రామదాసు, జిల్లా సెక్రటరీ జేవీ రమణ, జిల్లా నాయకులు ఎల్లయ్య, రామాంజనేయులు, రామదాసు పాల్గొన్నారు.